https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 24 సోమవారం 18-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## సుప్రీం జడ్జీల సంఖ్య పెంపు

**34 నుంచి 38కి పెరగనున్న సంఖ్య**

**సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం**

**న్యాయ వ్యవస్థ బలోపేతానికి కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ, మే 17:**
దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచేందుకు రూపొందించిన సవరణ చట్టానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉన్న జడ్జీల సంఖ్య 34 నుంచి 38కు పెరగనుంది. సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య సవరణ చట్టం--2026కు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వెల్లడించారు. కేంద్ర క్యాబినెట్ ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. జడ్జీల సంఖ్య పెంపునకు సంబంధించిన ప్రతిపాదనకు ఈ నెల 5న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. అనంతరం దీనిని రాష్ట్రపతికి పంపగా, ఆమె అధికారికంగా ఆమోదం తెలిపారు. దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం కీలకంగా మారింది. కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడంలో అదనపు జడ్జీల నియామకం సహాయపడుతుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు న్యాయవాదులు, న్యాయమూర్తులు స్వాగతిస్తున్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ మాట్లాడుతూ, జడ్జీల సంఖ్య పెంపు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అంశమని తెలిపారు. అయితే సంఖ్య పెంపుతో పాటు మౌలిక వసతుల విస్తరణ కూడా అవసరమని సూచించారు. సుప్రీంకోర్టు కొత్త భవనం నిర్మాణం ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది జడ్జీలు పనిచేసేలా సదుపాయాలు కూడా ఏర్పాటు చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

## భారత సెమీకండక్టర్స్‌కు నెదర్లాండ్స్ దన్ను

### టాటా-డచ్ సంస్థల భాగస్వామ్యంతో గుజరాత్‌లో భారీ కంపెనీ

**డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు.. 17 ఒప్పందాలు**

**నెదర్లాండ్స్ పర్యటన ముగించుకొని స్వీడన్ చేరుకున్న భారత ప్రధాని**



**ది హేగ్, మే 17:**
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బూమ్‌తో ప్రపంచమంతా సెమీకండక్టర్లు, చిప్‌లకు కొరత ఏర్పడిన నేపథ్యంలో భారత్‌లో సెమీకండక్టర్ల పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందించేందుకు నెదర్లాండ్స్ ముందుకొచ్చింది. భారత పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్, నెదర్లాండ్స్ కంపెనీ ఏఎస్ఎంఎల్ సంయుక్తంగా గుజరాత్‌లోని ధోలేరాలో భారీ సెమీకండక్టర్ కంపెనీని నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. నాలుగు దేశాల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. శనివారం సాయంత్రం (స్థానిక కాలమానం) నెదర్లాండ్స్‌లో ఆ దేశ ప్రధాని ప్రధాని రాబ్ జెట్టెన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇద్దరు ప్రధానుల సమక్షంలో ఈ రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. మొత్తంగా రెండు దేశాల మధ్య వివిధ రంగాల్లో 17 ఒప్పందాలు కుదిరాయి. రక్షణ, క్రిటికల్ మినరల్స్, శాస్త్రసాంకేతిక రంగం, ఆరోగ్యం, వ్యవసాయం, నీటి నిర్వహణ, వాతావరణ మార్పులు, ఇంధనం, సముద్ర రవాణా, ప్రజా సంబంధాలు తదితర రంగాల్లో పరస్పరం సహకారం అందించుకోవాలని నిర్ణయించారు. చర్చల అనంతరం ఇద్దరు ప్రధానులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ సంక్షేమం దృష్ట్యా హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరిచి వాణిజ్య నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని, ఉక్రెయిన్, రష్యాలు వెంటనే యుద్ధాన్ని ఆపేసి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా-ఇరాన్ యుద్ధ వల్ల పశ్చిమాసియాలో ఏర్పడిన కల్లోల పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేశారు. ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం నెదర్లాండ్స్ మద్దతు ప్రకటించింది. 'నెదర్లాండ్స్‌లో నా పర్యటన రెండు దేశాల సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని తెరిచింది. సాధారణ సంబంధాలను అనేక రంగాల్లో వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లింది' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. తన పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌లోని ప్రధాన కంపెనీల సీఈవోలతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో దాదాపు 300మంది సీఈవోలు పాల్గొన్నారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని వారిని మోదీ ఆహ్వానించారు. నెదర్లాండ్స్ పర్యటనను ముగించుకొని ప్రధాని మోదీ ఆదివారం స్వీడన్ చేరుకున్నారు. కాగా, డచ్ ప్రధాన రాబ్ జెట్టెన్‌తో కలిసి ప్రఖ్యాత జలాశయం అఫ్స్లుట్‌డెక్ డ్యామ్‌ను మోదీ సందర్శించారు. నీటి నిర్వహణలో ఈ డ్యామ్ ప్రపంచంలోనే ఒక అద్భుతంగా పేరుగాంచింది. ఇది 32 కిలోమీటర్ల పొడవైన డ్యామ్ కమ్ కాజ్‌వే. దీనిని 1932లో నిర్మించారు. ఈ డ్యామ్ ఉత్తర సముద్రాన్ని(వాడెన్ సీ), ఇస్సెల్‌మీర్ మంచినీటి సరస్సును వేరు చేస్తుంది. 90 ఏళ్లుగా వరదల నుంచి నెదర్లాండ్స్‌లోని చాలా భూభాగాన్ని ఈ డ్యామ్ కాపాడుతోంది. సముద్రం మధ్యలో ఈ కాజ్‌వేను 300 ఫీట్ల వెడల్పుతో నిర్మించారు.

**మోదీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం**

నెదర్లాండ్స్ నుంచి స్వీడన్ చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. మోదీ ప్రయాణిస్తున్న విమానం స్వీడన్ గగనతలంలోకి ప్రవేశించగానే ఆ దేశానికి చెందిన గ్రిపెన్ యుద్ధ విమానాలు గౌరవ సూచకంగా మోదీ విమానానికి ఎస్కార్ట్‌గా వచ్చాయి. వాటి రక్షణలో మోదీ స్వీడన్‌లోని రెండో అతిపెద్ద నగరం గోతెన్‌బర్గ్‌లో ల్యాండ్ అయ్యారు. ఆయనకు స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెన్‌సన్ స్వయగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు ద్వైపాక్షి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మోదీకి క్రిస్టెన్?స.. స్వీడన్ అత్యున్నత పురస్కారమైన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్'ను ప్రకటించారు. మోదీకి ఇప్పటివరకు లభించిన అంతర్జాతీయ పౌర పురస్కారాల్లో ఇది 31వది. ఆదివారం సాయంత్రం మోదీకి స్వీడన్ ప్రధాని విందు ఇచ్చారు.

## ఎన్ఐడీ నవకల్పన కేంద్రాన్ని ప్రారంభించిన అమిత్ షా

గాంధీనగర్‌లో ఘనంగా ప్రారంభోత్సవం

యువతను ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దే లక్ష్యం

'డిజైన్డ్ ఇన్ ఇండియా'కు ప్రపంచ స్థాయి గుర్తింపు లక్ష్యం



**గాంధీనగర్, మే 17:**
దేశంలో నవకల్పన, రూపకల్పన, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతమిచ్చే దిశగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఎన్ఐడీ ఇంక్యుబేషన్ అండ్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి పాల్గొన్నారు. ఈ కేంద్రం దేశ యువతలో సృజనాత్మకత, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించనుంది. కార్యక్రమంలో మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రయాణంలో డిజైన్, నవకల్పన, పారిశ్రామిక ఆలోచనలు కీలక పాత్ర పోషించబోతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో కొత్త ఆలోచనలు, సృజనాత్మకత ప్రధాన బలంగా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. ఎన్ఐడీ వంటి సంస్థలు యువతను కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలు సృష్టించే స్థాయికి తీసుకెళ్లే దిశగా పనిచేస్తాయని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఉపాధి అవకాశాలను పెంచడంలో ఇలాంటి సంస్థ లు కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. భారతదే శం లోని సృజనాత్మక ప్రతిభకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ఈ కేంద్రం ఉపయోగ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'డిజైన్డ్ ఇన్ ఇండియా' భావనకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. దేశంలో యువతకు నవకల్పన, పరిశోధన, స్వయం ఉపాధి అవకాశాల దిశగా మార్గదర్శకంగా నిలిచే కేంద్రంగా ఇది అభివృద్ధి చెందుతుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. భారతదేశాన్ని ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో ఇది మరో కీలక అడుగుగా భావిస్తున్నారు.

## సాధారణ ఖైదీలతోనే భగీరథ్

**విచారణ ఖైదీలు ఉండే బ్యారక్ కేటాయింపు**



**హైదరాబాద్, మే 17:**
పోక్సో కేసులో జ్యుడీషియల్ కస్టడీకి వచ్చిన బండి సాయి భగీరథ్‌ను చర్లపల్లి సెంట్రల్ జైలు అధికారులు సాధారణ ఖైదీలతోనే ఉంచారు. ఎలాంటి ప్రత్యేక సదుపాయాలూ కల్పించకుండా.. విచారణ ఖైదీలు ఉండే బ్యారక్‌నే ఆయనకు కేటాయించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌కు కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు శనివారం అర్ధరాత్రి తర్వాత రెండు గంటల సమయంలో భగీరథ్‌ను చర్లపల్లి జైలుకు తీసుకువెళ్లారు. జైలు అధికారులు దాదాపు గంటపాటు ఆయనకు సాధారణ వైద్య పరీక్షలు, ఇతర ఫార్మాలిటీలు పూర్తి చేశారు. తర్వాత నేరుగా విచారణ ఖైదీలు ఉండే బ్యారక్‌కు తరలించారు. భగీరథ్‌కు ఎలాంటి 'ప్రత్యేక' సదుపాయాలు కల్పించలేదని చర్లపల్లి జైలు అధికారులు తెలిపారు. అయితే భగీరథ్‌ను ఉంచిన బ్యారక్‌లోని విచారణ ఖైదీలు కాకుం డా ఇతర ఖైదీలెవరూ అటువైపు వెళ్లకుండా ఏర్పాటు చేశారని, జైళ్లశాఖ ఉన్నతాధికారులు ఈ మేరకు సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారని సమాచారం. ఇక జైలులో ఖైదీలకు రోజువారీగా ఇచ్చే అల్పాహారం తీసుకోలేదని, సమాచారం.

## 20 మందితో సతీశన్ క్యాబినెట్

**కేరళ సీఎంగా నేడు సతీశన్ ప్రమాణ స్వీకారం**



**తిరువనంతపురం, మే 17:**
కేరళ సీఎంగా సోమవారం ప్రమాణం చేయనున్న వీడీ సతీశన్ తన మంత్రివర్గ సభ్యుల పేర్లను వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపిన తర్వాత మంత్రివర్గంలోకి తీసుకునే వారి జాబితాను ఖరారు చేసినట్లు చెప్పారు. మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు కానుండగా అందులో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టనున్న వారే కావడం గమనార్హం. మంత్రుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు ఎస్సీలు ఉండనున్నారు. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని మంత్రులను ఎంపిక చేసినట్లు సతీశన్ వెల్లడించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, మురళీధరన్, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్‌లను మంత్రివర్గం లోకి తీసుకున్నట్లు చెప్పారు. సీనియర్ ఎమ్మెల్యే తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలని యూడీఎఫ్ నిర్ణయించిందని వివరించారు.

## హైదరాబాద్ అభివృద్ధికి కేసీఆర్ పాలనే మార్గం: కేటీఆర్

**- ఎల్బీనగర్‌లో 'మన బూత్ - మన బాధ్యత' కార్యక్రమం**

**- నగర పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**

**- కార్పొరేషన్ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**



**హైదరాబాద్, మే 17**
ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డి. సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన బూత్ – మన బాధ్యత' కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలు, పార్టీ నాయకులతో సమావేశమైన ఆయన భవిష్యత్ రాజకీయ వ్యూహాలు, హైదరాబాద్ నగర అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన పలువురు ప్రజాప్రతిని ధులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్, హైదరాబాద్ నగరం మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం రావాల్సిందేనని వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని, ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని అన్నారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టిందని విమర్శించారు. నగర అభివృద్ధి కార్యక్రమాలు మందగించాయని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం వెనుకబడిందని ఆరోపించారు. ఆరోగ్య రంగానికి సంబంధించిన టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై త్వరలోనే భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు.

# ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం

**కేశవరావు నేతృత్వంలో కీలక చర్చలు**
**ఉద్యమకారుల గుర్తింపుకు నాలుగు కేటగిరీల ప్రతిపాదనలు**
**జిల్లాల వారీగా అభిప్రాయ సేకరణకు కమిటీ నిర్ణయం**





**హైదరాబాద్, మే 17:**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం కేశవరావు నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారికి గుర్తింపు కల్పించే అంశంపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు అధికారికంగా కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమావేశంలో సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అమరవీరుల జ్యోతి వద్ద ఉన్న కార్యాలయాన్ని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాలయంగా ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే అమరవీరుల గుర్తింపుపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి సూచనలు, అభిప్రాయాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల సంయుక్త కార్యాచరణ కమిటీ, 1969 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల సంఘాలు, సబ్బండ వర్గాల జేఏసీలు, న్యాయవాదుల సంఘాలు, వివిధ జిల్లాల్లో ఏర్పడిన ఉద్యమ సంస్థల నుంచి కూడా ప్రతిపాదనలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు జిల్లా పర్యటనలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో విస్తృతంగా చర్చలు జరిపి అన్ని వర్గాల అభిప్రాయాలు సేకరించనున్నట్లు వెల్లడించింది. ఉద్యమకారులను గుర్తించేందుకు నాలుగు కేటగిరీలుగా విభజించాలని కమిటీ ప్రతిపాదించింది. ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యం, గాయపడిన వారికి రెండో ప్రాధాన్యం, జైలుకు వెళ్లినవారు లేదా కేసులు ఎదుర్కొన్నవారికి మూడో కేటగిరి, క్షేత్రస్థాయిలో ఉద్యమం చేసినవారికి నాలుగో కేటగిరి ఇవ్వాలని సూచించింది. ఉద్యమంలో భాగమైన పౌరసమాజ ప్రతినిధులు, 1969, 1972, 1996 ఉద్యమాల్లో పాల్గొన్న వారితో కూడా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల ఎంపిక జరుగుతుందని, గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని కమిటీ స్పష్టం చేసింది

# రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి

**భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి**
**మరో ముగ్గురు భారతీయులు గాయపడిన ఘటన**
**భారత రాయబార కార్యాలయం స్పందన**



**మాస్కో, మే 17**
రష్యాపై ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు పాల్పడిన ఘటన అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడుల్లో భారతీయ కార్మికుడితో సహా నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరో ముగ్గురు భారతీయ కార్మికులతో పాటు పలువురు గాయపడినట్లు రష్యాలోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. దాడి జరిగిన ప్రాంతాన్ని భారత రాయబార కార్యాలయ అధికారులు సందర్శించినట్లు సమాచారం. గాయపడిన భారతీయ కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయం అందించేందుకు స్థానిక అధికారులు, సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు రాయబార కార్యాలయం తెలిపింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిపట్ల భారత రాయబార కార్యాలయం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. గాయపడిన వారికి వైద్య సహాయం, ఇతర అవసరాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. భారతీయ కార్మికుల భద్రతపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా ఆదివారం తెల్లవారుజామున ఉక్రెయిన్ రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టినట్లు రష్యా అధికారులు తెలిపారు. మాస్కో రాజధానితో పాటు పలు సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు వెల్లడించారు. ఈ దాడులు దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించినట్లు సమాచారం. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రాజధాని మాస్కో వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల కారణంగా పలు నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. మాస్కో ప్రాంతంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో కూడా నష్టం సంభవించినట్లు సమాచారం. రష్యా--ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నీట్ లీకేజీపై మోదీని ప్రశ్నించిన రాహుల్

**విద్యాశాఖ మంత్రి రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్**
**వరుస పేపర్ లీకేజీలపై కేంద్రంపై తీవ్ర విమర్శలు**
**మోదీ మౌనంపై ప్రశ్నల వర్షం కురిపించిన ప్రతిపక్ష నేత**



**న్యూఢిల్లీ, మే 17:**
దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం మరోసారి రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ, నీట్ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పేపర్ లీకేజీ ఘటనల తర్వాత కూడా కేంద్రం సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపిస్తోందని, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వానికి బాధ్యత ఉండాలని సూచించారు. గతంలో జరిగిన నీట్ పరీక్షల్లో కూడా పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర వివాదాలు తలెత్తాయని రాహుల్ గుర్తు చేశారు. నీట్ 2024లో పేపర్ లీక్ కావడంతో పరీక్ష రద్దు అయిందని, ఆ సమయంలో సీబీఐ విచారణ చేపట్టారని పేర్కొన్నారు. ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారని, కానీ మూల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని విమర్శించారు. ఇప్పుడు నీట్ 2026లో కూడా అదే పరిస్థితి పునరావృతం కావడం ఆందోళనకరమని అన్నారు. పేపర్ లీక్ జరిగినప్పటికీ సంబంధిత మంత్రిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రతి సారి విచారణలు, కమిటీలు ఏర్పాటు చేయడం తప్ప కేంద్రం అసలు సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ తన వ్యాఖ్యల్లో ప్రధాని మోదీని నేరుగా ప్రశ్నించారు. వరుసగా పేపర్ లీక్ ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి..? పరీక్షల వ్యవస్థలో లోపాలు ఎక్కడ ఉన్నాయో ప్రభుత్వం ఎందుకు గుర్తించలేకపోతోంది..? విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశంపై ప్రధాని ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. ఇక వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎందుకు బాధ్యత వహింపజేయడం లేదని నిలదీశారు. పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో నమ్మకం దెబ్బతింటోందని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ఇలాంటి ఘటనలు వారి మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం ఇప్పటికే దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

## సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ..




చెక్కు పంపిణీ చేస్తున్న దృశ్యం

**దౌల్తాబాద్, మే 17**
మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గడ్డం బాలరాజుకు సీఎం సహాయ నిధి రూ.60 వేలు మంజూరి కాగా ఆ చెక్కును ఆదివారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సరుగారి యాదవ్ రెడ్డి, ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగరాజు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్న బాధితులను సీఎం ఆర్ ఎఫ్ ఎంతో ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్ గౌడ్, మండల వికలాంగుల అధ్యక్షుడు నర్సింలు, లక్ష్మినారాయణ, గడ్డం స్వామి, కరుణాకర్, బగ్గీ సురేష్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు షురూ...



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

**దౌల్తాబాద్, మే 17**
కోనాయిపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ,గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనులు చేపదుతున్నా మన్నారు.ఇందులో ఉప సర్పంచ్ స్వాములు, వార్డు సభ్యులు గాజుల పుష్ప, కలాలి కలవ్వ, పొన్నాల స్వామి,గ్రామ ప్రజలు తదితరులున్నారు.

## ఆవుల ధృవీకరణపై ఎమ్మెల్యే వ్యాఖ్యల దుమారం

**బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాజకీయ రచ్చ**
**ఆవుల జనన ధృవీకరణ పత్రాలపై కొత్త వివాదం**
**వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టిన టీఎంసీ**



**కోల్‌కతా, మే 17**
పశువుల రవాణా అంశంపై పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆవుల జనన ధృవీకరణ పత్రాలు చూపించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యే రేఖా పాత్ర చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలను తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. శనివారం హింగల్‌గంజ్ పరిధిలోని లెబుఖాలి ప్రాంతంలో పశువులను తరలిస్తున్న ఒక వాహనాన్ని ఎమ్మెల్యే రేఖా పాత్ర అడ్డుకున్నట్లు సమాచారం. వాహనంలోని పశువులను కిందకు దించి రోడ్డు పక్కన చెట్టుకు కట్టించి వాటికి గడ్డి, నీరు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమ పశు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తమ పార్టీ నాయకత్వం ఆదేశించిందని రేఖా పాత్ర తెలిపారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే 14 ఏళ్లలోపు ఉన్న పశువులను వధించకూడదనే నిబంధనలు అమలులో ఉన్నాయని ఆమె వివరించారు. ఎవరైనా పశువులను అక్రమంగా రవాణా చేస్తే వాటికి సంబంధించిన వివరాలు అడుగుతామని చెప్పారు. ఈ క్రమంలో ఆవుల జనన ధృవీకరణ పత్రాలు చూపించాలని కోరుతామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఆవులకు జారీ చేసిన జనన ధృవీకరణ పత్రాలను చూపించగలరా అని టీఎంసీ నేతలు ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసమే చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలతో ఇప్పుడు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. పశువుల రవాణా, అక్రమ వ్యాపారం, చట్టాల అమలు అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి.

# వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యం పై చింతకుంట రైతుల ధర్నా





**కథలాపూర్, మే 17**
కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన రైతులు ఈరోజు కోరుట్ల నుండి వేములవాడ వెళ్లే రోడ్డుపై దుంపేట గ్రామం వద్ద కొనుగోలు జాప్యం పై ధర్నా చేశారు. వరి ధాన్యం కొనుగోలు రోజులు, నెలల తరబడి జాప్యం జరుగుతుందంటూ రైతులు మండిపడ్డారు.

వరి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ రైతులు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల గోస పోసుకుంటుందని, రైతుల ఉసురు తగిలి ప్రభుత్వం తగులుతుంది అని రైతులు కాంగ్రెస్ డౌన్ డౌన్, రైతు వ్యతిరేకి రేవంత్ సర్కార్ అంటూ నినాదలు చేస్తూ రోడ్ పైన బైఠాయించారు. రాష్ట్ర ప్రభుత్వం, మరియు స్థానిక ఎమ్మెల్యే గారు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు, రైతులకు మద్దతుగా మాజీ జెడ్పిటిసి, గ్రామ సర్పంచ్ నాగం భూమయ్య, ఉప సర్పంచ్ పోకతోట లింబాద్రి పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమం లో రైతులు సోమ దేవేందర్ రెడ్డి, రొక్కం తిరుపతి రెడ్డి,చెదలు శేఖర్,కాటి పెల్లి చిన్న భూమా రెడ్డి,బీర్ల మల్లేశం, తోట రాకేష్,నల్లూరి స్వామి,బూర్గు రమేష్,సోమ మహిపాల్ రెడ్డి,గంగ మల్లయ్య,కాటిపెల్లి వెంకట రెడ్డి, కాటి పెల్లి భూమ రెడ్డి, కుంట జలంధర్, నిమ్మల చిన్న రాజా రెడ్డి,మంతెన రాజేందర్,పాల్గొన్నారు.

# తరలింపులు ట్రాక్టర్లతో.. చార్జీలు లారీలకా..

**- వడ్ల ట్రాన్స్‌ఫోర్ట్ వ్యవహారంలో భారీ గోల్ మాల్**

**- అధికారుల సహకారంతో ప్రభుత్వానికే కాంట్రాక్టర్ కుచ్చుటోపీ**



**మన సమాజం/చెన్నూరు:**
వడ్ల తరలింపులో ప్రభుత్వ సొమ్ము నీరుగారుతున్న వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేవలం వేలాది రూపాయల ఖర్చులతో వడ్ల కొనుగోలు కేంద్రాల నుండి దాన్యాన్ని తరలిస్తూ ప్రభుత్వం నుండి కాంట్రాక్టర్ కోట్లాది రూపాయలు చార్జీల రూపంలో వసూలు చేస్తున్నాడనే ఆరోపణలు వ్యక్తం అవుతుండగా, అధికారుల తీరుపై సైతం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల నుండి నేరుగా ధాన్యాన్ని సమీప ప్రభుత్వ గోదాములకు తరలిస్తుండడాన్ని ఆసరాగా చేసుకుని కాంట్రాక్టర్ ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారానే తరలిస్తూ లారీల ద్వారా తరలిస్తున్నట్లు పేర్కొంటూ బిల్లులు పెడుతున్నాడని, తద్వారా వడ్ల సరఫరా ఆలస్యం అవుతుండడంతో పాటు లారీ యజమానులకు ఉపాధి లేకుండా పోతుందని, గత 11ఏళ్లుగా ఒకే కాంట్రాక్టరుతో వడ్ల ట్రాన్స్పోర్ట్ ఒప్పందాన్ని కుదుర్చుకొని ఈ వ్యవహారంలో అధికారులు సైతం వాటాలు అందుకుంటూ ప్రభుత్వ సొమ్ముకు భారీగా గండి కొడుతున్నారని, గతంలోనూ ఇదే కాంట్రాక్టర్ వడ్ల తరలింపులో తప్పుడు లెక్కలతో అధికారులను బురిడీ కొట్టించాడనే ఆరోపణలు ఉన్నప్పటికీ పదకొండేళ్లుగా అతడినే కొనసాగిస్తుండడం షోచనీయమని, ఇప్పటికైనా వడ్ల తరలింపులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని ప్రభుత్వ సొమ్ము దోపిడీని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆక్రమణ తొలగించరు.. రోడ్డు వేయరు..

**- కరుణా కనికరం మరిచిన ఆస్నాద్ దొర**

**- రోడ్డు స్థలంలోనే లాడ్జి నిర్వహణ..**

**- అధికార పార్టీ నేతకు మున్సిపల్ అధికారుల మౌన మద్దతు**

**- బురదలోనే ప్రజల ప్రయాణం**

**- ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు శూన్యం**

**- దళితవాడ అభివృద్ధిని ఆస్నాద్ దొరే అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు**



**మన సమాజం/చెన్నూరు:**
చెన్నూరులో రోడ్డు విస్తరణ పేరుతో చిన్నచిన్న దుకాణాలు, పేదల షెడ్లను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు అధికార పార్టీకి చెందిన మంత్రి ముఖ్య అనుచరుడి ఆక్రమణ విషయంలో మాత్రం కళ్లు మూసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త బస్టాండ్ సమీపంలోని దళితవాడకు వెళ్లే ప్రధాన రహదారిని కరుణా కనికరం లేకుండా ఆస్నాద్ కు చెందిన దొర ఆక్రమించి రోడ్డుకు అడ్డంగా భవనం నిర్మించి లాడ్జి నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశమవుతుంది. స్థానికుల కథనం ప్రకారం.. రహదారి స్థలంలోనే నిర్మాణం చేపట్టడంతో దళితవాడకు వెళ్లే దారి ఇరుకుగా మారింది. రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తే ఆక్రమణ వ్యవహారం బయటపడుతుందనే ఉద్దేశంతోనే అధికారులతో ఉద్దేశపూర్వకంగా పనులు నిలిపివేస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దాదాపు 7వ వార్డు అభివృద్ధికి గానూ 2కోట్లకు పైగా నిధులు మంజూరు అయినప్పటికీ ఆక్రమణలు తొలగించాల్సి వస్తుందనే నెపంతో నిధులను నీరుగారుస్తున్నారని, తద్వారా వర్షం పడితే చాలు దళితవాడకు వెళ్లే మార్గం పూర్తిగా బురదమయంగా మారుతోందని, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే మహిళలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, అత్యవసర సమయంలో అంబులెన్స్ సైతం వెళ్లలేని దుస్థితి నెలకొన్నా మున్సిపల్ అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. పేదలపై ఒక చట్టం, అధికార పార్టీ అనుచరులపై మరో చట్టమా?అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణ పేరుతో సామాన్యుల నిర్మాణాలను గంటల్లో నేలమట్టం చేసే అధికారులు.. ఈ ఆక్రమణపై ఎందుకు మౌనం పాటిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రహదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, దళితవాడకు తక్షణమే సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# పొదుపు సరే, విదేశీ మదుపులు ఏవీ?

'దేశ ఆర్థిక వ్యవస్థకు నానా సమస్యలు సంచితమవుతున్నాయి. దిగుమతి సుంకాలపై అమెరికాతో మన సంబంధాలు సజావుగా లేవు. అవి కలహశీలంగా పరిణమిస్తున్నాయి. సకల కార్యకలాపాలకు విస్తరిస్తూ, విజృంభిస్తున్న కృత్రిమ మేధ సాంకేతికతను స్వంతంగా సమకూర్చుకోవడంలో మనం వెనుకబడి ఉండడమే కాకుండా తప్పుదోవలో కూడా ఉన్నాము. ఎన్నికలలో జయపతాక నెగురవేసే విషయమై ఎంతగా శ్రద్ధాసక్తులు చూపుతున్నారో అంతకంటే మిన్నగా విదేశీ పెట్టుబడిని మళ్లీ దేశానికి తీసుకువచ్చేందుకు దృష్టి పెట్టాలి, అందుకు దీక్షాదక్షతలు చూపాలి. ప్రైవేట్ పెట్టుబడి స్తబ్దమైపోయింది. కారణమేమిటి? వ్యాపారరంగ క్షేత్రస్థాయి వాతావరణం అంతులేని కష్టనష్టాలకు మాత్రమే ఆస్కారమిచ్చేదిగా ఉన్నది. అడుగడుగునా కఠిన నిబంధనలు, దర్యాప్తు సంస్థలు వ్యాపారవేత్తలను అమితంగా భయపెడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యాపార సౌలభ్యం ఎలా సాధ్యమవుతుంది? భారత ఆర్థిక వ్యవస్థ శక్తిసామర్థ్యాల పట్ల ఆశావాదులూ ఉన్నారు, నిరాశావాదులూ ఉన్నారు. అయితే ఈ ఇరువురినీ భారత్ ఒకేలా అసంతృప్తికి లోనుచేస్తోంది మనకు ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన స్టాక్ మార్కెట్ ఉన్నది. దానిని కాపాడుకునేందుకైనా మనం జాగరూకత చూపకపోతే ఎలా?' పాఠక మహాశయా, ఇవి నా మాటలు అనుకుంటున్నారా? నావి కావు. పోకిరీ వ్యాఖ్యలు చేసే ముందు కొంచెం నెమ్మదించండి. ఇవి రుచిర్ శర్మ (ప్రష్త్రవ =అంవ ఖఅం ఖీఘశ్రీశ్రీ శీట చీఫ్ఆశీలం, ఔష్ట్రఫ్ షవత్ షతీశీఅస్త్ర షఠ్ష్త్ర ఝఝూఘ్శ్రీఅంఎ మొదలైన సుప్రసిద్ధ పుస్తకాల రచయిత) వ్యాఖ్యలవి. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుతెన్నులకు తీవ్ర అభిశంసనే ఆ వ్యాఖ్యలు. ఆ వ్యాఖ్యలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నానని ఒప్పుకుంటున్నాను. అమెరికాతో సన్నగిల్లిన సంబంధాలు, విదేశీ పెట్టుబడులను మళ్లీ ఆకర్షించవలసిన ఆవశ్యకత, వ్యాపార సౌలభ్యానికి సానుకూలంగా లేని పరిస్థితులు, దర్యాప్తు సంస్థల పాత్ర గురించి రుచిర్ శర్మ వ్యాఖ్యలతో విభేదించవలసిన అవసరమేమున్నది? ఆ విషయాలేవీ ప్రజల దృష్టికి రావడం లేదు. పార్లమెంటరీ, ప్రజా చర్చలలో వాటిని తెలివిగా ఉపేక్షిస్తున్నప్పుడు ప్రజలకు వాస్తవాలు ఎలా తెలుస్తాయి? నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. రెండు రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి వచ్చింది.

## గడ్డం శ్రీహితకు శాలువా సత్కారం చేసిన లోక బాబు రెడ్డి

**కథలాపూర్, మే 17**



జగిత్యాల జిల్లా కథలా పూర్ మండల మండల భూషన్ రావు పెట్ గ్రామానికి చెందిన గడ్డం చిన్నారెడ్డిడ జీవిత గార్ల కుమార్తె గడ్డం శ్రీహీత ఇంటర్ ఎంపీసీ లో అత్యధిక మార్కులు 988 మార్కులు సంధించిన విద్యార్థినీని శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించిన రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి ఈ కార్యక్రమంలో వారి వెంట భూషన్ రావు పెట్ గ్రామ సర్పంచ్ బద్ధం మహేందర్, ముస్కు శ్రీనివాస్,బెజ్జరాపు శేఖర్ రెడ్డి, పురుకుటపు గంగారెడ్డి,పురుకుటపు వెంకట్ రెడ్డి,గడ్డం శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## తాటిపల్లి గురుకుల విద్యార్థులకు రూ. 10000 నగదు బహుమతి అందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**మల్యాల, మే, 17**
తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్, గర్ల్స్, మల్యాల మండలం తాటిపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ రోజు నిర్వహించిన "ప్రజాపాలన -- ప్రగతిపాలన : విద్యా వారోత్సవాలు" లో భాగంగా ఇంటర్మీడియట్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా టాపర్లు డి. రుచిత మరియు కె. ఆశ్రితలకు రూ.10,000 నగదు బహుమతిని అందజేశారు. అలాగే పదవ తరగతి లో మండల టాపర్లుగా నిలిచిన ఎం. సాన్విక, డి.హర్షిక,టీ.రష్మికలను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖులు ఏంఈఓ జయసింహారావు, డీఈఓ రాము , మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మరియు ఎమ్మెల్యే డా. సంజయ్ విద్యార్థులను మరియు ప్రిన్సిపాల్ మానస ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విజయాలు పాఠశాలకే కాకుండా మొత్తం ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

## ధాన్యం కొనుగోళల్లో జ్యాప్యం..రైతుల ధర్నా



**మల్లాపూర్ మే 17**
ధాన్యంకొనుగోళల్లో జ్యాప్యంపై నిరసిస్తూ మల్లాపూర్ మండల కేంద్రంలోని భారతమాత కూడలి వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. గన్ని సంచుల కొరత, అధిక హమాలి ఖర్చు, లారీల కొరత, తూకంలో కటింగ్ వంటి సమస్యలతో పాటు ధాన్యం కొనుగోళల్లో చాలా జ్యాప్యం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు ప్రభుత్వం, జిల్లా యంత్రంగం వెంటనే చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చెయ్యలని కోరుతున్నాను. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మంత్రి పదవుల వేట.. ఆశావహుల హస్తిన బాట!

**న్యూఢిల్లీ, మే 17**
తెలంగాణలో మంత్రి పదవుల కోసం ఎమ్మెల్యేల వేట మొదలైంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళనపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించబోతోందన్న వార్తలతో ఆశావహులు హస్తిన బాట పట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి కావస్తుండటం, క్యాబినెట్‌లో మూడు ఖాళీలు ఉండటంతో.. ఈసారి ఎలాగైనా మంత్రి పదవి దక్కించుకోవాలని ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు, పనితీరు ఆధారంగా కొందరిని మార్చే అవకాశం ఉందన్న ప్రచారంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్ ఎమ్మెల్యేలతో పాటు సామాజిక, ప్రాంతీయ సమీకరణాల రీత్యా అవకాశం వస్తుందని భావిస్తున్న నేతలు ఇప్పటికే ఢిల్లీలో మకాం వేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. మూడు తరాలుగా తాము కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని ఉన్నామని, బీఆర్ఎస్ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా కాంగ్రెస్‌ను వీడలేదని, తన నిబద్ధత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని తనకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ విషయం తెలిసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హుటాహుటిన శనివారం సాయంత్రమే ఢిల్లీకి చేరుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తనకే అవకాశం కల్పించాలని గతంలో విన్నవించిన ఆయన.. మరోసారి తన ప్రయత్నాలను ముమ్మరం చేసేందుకు హస్తిన బాట పట్టారు. వీరిద్దరితో పాటు మరికొందరు ఆశావహులు కొంతకాలంగా ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు లాబీయింగ్ మొదలుపెట్టారు.



# నా కల నిజమైంది

కన్నడ సొగసరి రుక్మిణి వసంత్‌కు కెరీర్‌లో బ్రేక్ రావడానికి కాస్త సమయం పట్టింది. అయితే రెండేళ్ల క్రితం వచ్చిన కన్నడ చిత్రం 'సప్తసాగరాలు దాటి' ఆమె సినీ ప్రయాణాన్ని పూర్తిగా మలుపు తిప్పింది. ఈ చిత్రంలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. దాంతో వరుస అవకాశాలు వెల్లువెత్తాయి. ఇప్పుడీ భామ చేతిలో ఉన్నవన్నీ భారీ చిత్రాలే. 'కాంతార చాప్టర్-1'లో ఈ భామ కనకావతి అనే పాత్రను పోషిస్తున్నది. ఇటీవలే ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. తాజా ఇంటర్వ్యూలో 'కాంతార చాప్టర్-1' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది రుక్మిణి వసంత్. చిత్ర హీరో, దర్శకుడు రిషబ్‌శెట్టి సినిమా కోసం తనను సంప్రదించినప్పుడు ఆనందానికి అవధులు లేకుండా పోయానని, తన కల నిజమైందనే భావన కలిగిందని రుక్మిణి వసంత్ పేర్కొంది. "కాంతార చాప్టర్-1' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం. చిత్రబృందం కోరిక మేరకు సినిమాలో నేను నటిస్తున్న విషయం కానీ, నా పాత్ర గురించి కానీ ఎక్కడా మాట్లాడలేదు. ఆ విషయాన్ని ఓ రహస్యంగా దాచి ఉంచాను. కొద్ది రోజుల క్రితమే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో నా పాత్ర గురించి అందరికీ తెలిసింది' అని రుక్మిణి వసంత్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నది. తమిళంలో 'మదరాసి', కన్నడంలో యష్ 'టాక్సిక్'లో నాయికగా నటిస్తున్నది.



# దిండు మారితే కలత నిద్రే..

శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఎక్కడికెళ్లినా తనతోపాటు ఓ దిండుని కూడా తీసుకెళ్తుంటారు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారిన సందర్భాలు చాలా ఉన్నాయి. అసలు జాన్వీ తనతోపాటు దిండును తీసుకెళ్లడానికి ఏమైనా ప్రత్యేకమైన కారణాలున్నాయా? అనే అంశంపై పలు కథనాలు కూడా వెలువడ్డాయి. రీసెంట్‌గా ఈ విషయంపై జాన్వీ స్పందించారు. 'నాకు పిల్లో ఫోబియో ఉంది. నా షూటింగులు రకరకాల ప్రదేశాల్లో జరుగుతుంటాయి. ఒక్కోసారి నైట్ అక్కడే స్టే చేయాల్సొస్తుంది. అలాంటి సందర్భాల్లో ఏ దిండు పడితే ఆ దిండును తలకింద వేసుకొని పడుకోలేను. కేవలం నా దిండుపై పడుకుంటేనే నాకు నిద్ర వస్తుంది. దిండు మారితే ఇక ఆ రాత్రంతా కలత నిద్రే. అందుకే తోడుగా దిండు తీసుకెళ్తుంటా. ఈ ఫోబియా నా చిన్నప్పట్నుంచీ ఉంది. ఇందులోంచి బయట పడేందుకు చాలాసార్లు ప్రయత్నించా. ప్రయత్నించిన ప్రతిసారీ నిద్రకు దూరమయ్యా.' అంటూ వాపోయారు జాన్వీ కపూర్. ఇక ఈ స్టేట్‌మెంట్ విన్న నెటిజన్లు.. 'కొత్త దిండు కొనుక్కోవచ్చుగా?', 'నీ ప్రొడ్యూసర్లు కొత్త దిండ్లు కూడా కొనలేరా?' అంటూ కామెంట్లు పెట్టేస్తున్నారు.



# అందరు యాక్టర్లతో కలిసి కనిపిస్తా..

చాలా మంది స్టార్లున్న సినిమాలో భాగం కావడం, వారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పింది. అంతేకాదు కూలీ ఆసక్తికర కథనంపై ప్రశంసలు కురిపించింది. హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన కథలో కీలకంగా సాగేలా ఉండబోతుందన్నది. ఇక లోకేశ్ కనగరాజ్ ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, తలైవా స్క్రీన్ ప్రెజెంటేషన్ కూలీని బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా నిలుపబోతున్నాయని ఇప్పటివరకు వచ్చిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్‌కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# ఆత్మగౌరవాన్ని అక్కడ వెతకొద్దు

అందానికి పర్యాయపదం ఐశ్వర్యారాయ్ అనేవారు ఒకనాటి యువత. ఇప్పుడు ఆమెలో పరిపూర్ణత కనిపిస్తున్నది. ఆమె మాటల్లో భావితరాలపై బాధ్యత వినిపిస్తున్నది. రీసెంట్‌గా సోషల్ మీడియా వినియోగం గురించి ఆమె అద్భుతంగా మాట్లాడారు. 'సోషల్ మీడియాలో వచ్చే లైక్స్, కామెంట్లు, షేర్లు మనలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపవు. నా దృష్టిలో సాంఘిక మాధ్యమానికి, మానసిక వత్తిడికి మధ్య పెద్ద తేడా లేదు. వయసుతో నిమిత్తం లేకుండా అందరూ ఈ మహమ్మారికి బానిసలవుతున్నారు. ఒక తల్లిగా నాకు ఈ విషయంపై ఆందోళనగా ఉంది. దయచేసి ఆత్మగౌరవాన్ని సామాజిక మాధ్యమాల్లో వెతకొద్దు.. అది కచ్చితంగా అక్కడ దొరకదు. దాన్ని దాటి ప్రపంచాన్ని గమనించండి. అప్పుడు తెలుస్తుంది ఆత్మగౌరవం అంటే ఏంటో. ఆత్మవిశ్వాసంలోనే ఉంటుంది నిజమైన అందం. దాన్ని ఎక్కడో వెతక్కండి. అది మనలోనే ఉంటుంది.' అంటూ చెప్పుకొచ్చారు ఐశ్వర్యారాయ్.

